క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో మరమ్మతులు చేపట్టనుండడంతో శుక్రవారం పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఆరిలోవ ఎస్ఎస్‌లో 11 కేవీ బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్ – 3 ఈఈ బి.సింహాచలం నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాండురంగాపురం, దుర్గాబజార్, లక్ష్మీనగర్, ఎర్నిదుర్గానగర్, శివాజీనగర్, పాత పోలీస్ స్టేషన్ ఏరియా తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

స్వీట్స్ బేకరీలో అగ్ని ప్రమాదం



బేకరీ వద్ద మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బీచ్‌రోడ్డు : చినవాల్తేరులోని ఏయూ అవుట్ గేటు ఎదురుగా గల మధు స్వీట్స్ బేకరీలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. సమయానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేశారు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో షాపు తెరిచిన నిర్వాహకులు బల్బు వేశారు. దీంతో షార్ట్‌సర్క్యూట్ కావడంతో షాపులో మంటలు చెలరేగాయి. షాపులోని ఆహార పదార్థాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఫర్నీచర్ అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వాహనంతో ఘటనా స్థలికి చేరుకుని మంటలు విస్తరించకుండా అదుపులోకి తెచ్చారు. ఎవరికీ ప్రమాదం జరగనప్పటికీ సుమారు రూ.25 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.


స్టార్టప్‌లపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానం అయ్యేందుకు స్థానిక డాక్టర్ వి.ఎస్.క్రిష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్టార్టప్ కార్యకలాపాలపై అవగాహన కల్పించామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం కళాశాల విద్యార్థులను ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా తయారు చేసేందుకు, వారికి అవసరమైన సలహాలు సూచనలు అందించేందుకు ఆంధ్ర యూనివర్సిటీ సహకారంతో అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇన్నోవేషన్ క్లబ్ సహకారంతో స్టార్టప్ దిశగా అడుగులు వేసి వ్యాపార అవకాశాల్ని అందిపుచ్చుకోవాలని తెలియజేశారు. ఆంధ్ర యూనివర్సిటీ ఆహబ్ సీఈవో రవి ఈశ్వరపు విద్యార్థులకు స్టార్టప్ స్థాపించడానికి ఉన్న అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ అరుణ కుమారి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ చాముండేశ్వరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయ, అకడమిక్ కోఆర్డినేటర్ రాజేశ్వరరావు, కామర్స్ విభాగ అధిపతి జి.రాజ్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు

విత్తన రాఖీలతో పర్యావరణానికి మేలు



విత్తన రాఖీల తయారీపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ఎంవీపీ కాలనీ : పర్యావరణానికి హానిచేయని విత్తనాల రాఖీలు వినియోగించాలని కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శ్రీలక్ష్మి సూచించారు. ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో గురువారం గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీఓ ఆధ్వర్యంలో విత్తన రాఖీల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో తయారయ్యే రాఖీల కారణంగా పర్యావరణానికి హాని జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో విత్తన రాఖీల తయారీ, వినియోగం అనేది వినూత్న ఆలోచన అన్నారు. రాఖీ పండగ సందర్భంగా యువత వినియోగించాలని సూచించారు. గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి రత్నం మాట్లాడుతూ విత్తన రాఖీల తయారీ, వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.



పూడిక పేరుకుపోయి అధ్వానంగా మారిన డ్రైనేజ్



ఫుట్‌పాత్ వ్యాపారంలో భాగంగా వ్యర్థాలు డ్రైనేజ్‌లోకి వేస్తున్న దృశ్యం



డ్రైనేజీ నుంచి వెలుపలకు తీసిన పూడిక

వ్యాపారమంతా ఫుట్‌పాత్‌లపైనే



ఏఎస్ రాజా కూడలిలో డ్రైన్‌లో వ్యర్థాలు తొలగిస్తున్న దృశ్యం

- ఫాస్ట్‌ఫుడ్ వ్యర్థాలతో పలుచోట్ల నిండిపోయిన డ్రైనేజీలు
- పూడికతీతకు జీవీఎంసీకి రూ.లక్షల్లో ఖర్చు
- ఎంవీపీ ఏఎస్ రాజా సర్కిల్, లాసన్స్ బే కాలనీల్లో దారుణం
- చోద్యం చూస్తున్న జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు



ఫుట్‌పాత్ వ్యాపారం కారణంగా అధ్వానంగా తయారైన ఏఎస్ రాజా కూడలి



లాసన్స్ బే కాలనీలో ఇటీవల తవ్విన డ్రైనేజీ నుంచి తీసిన వ్యర్థాలు



వ్యర్థాలతో అధ్వానంగా డ్రైన్

ఎంవీపీ కాలనీ : జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ తీరుతో ఎంవీపీ కాలనీలో అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయి. ఫుట్‌పాత్ వ్యాపారాన్ని నియంత్రించాల్సిన ఆ విభాగం అధికారులు, సిబ్బంది కాసులు దండుకునేందుకు పరిమితం కావడమే ఇందుకు నిదర్శనం. ఈ కారణంగా ఎంవీపీ కాలనీ పరిధిలోని 17, 18, 19 వార్డుల్లో పెద్ద ఎత్తున ఫుట్‌పాత్ వ్యాపారం పెరిగి జీవీఎంసీకి రూ.లక్షల్లో నష్టం చేకూరుస్తోంది. ఇటీవల ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కూడలి, లాసన్స్ బే కాలనీలో డ్రైనేజీలు మరమ్మతులకు గురికావడమే ఇందుకు ఉదాహరణ. ఆయా ప్రాంతాల్లో పెరిగిపోయిన ఫుట్‌పాత్ వ్యాపారం కారణంగా డ్రైనేజీలు అతలాకుతలంగా మారాయి. ఫుట్‌పాత్ వ్యాపారాలు, రాత్రి టిఫిన్స్ వ్యాపారాలు ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీలను చెత్తతో నింపేస్తుండటంతో అవి దాదాపుగా మూతబడిపోయాయి. ఇటీవల పలు చోట్ల మరమ్మతులు నిర్వహించగా జీవీఎంసీకి రూ.లక్షల్లో ఖర్చవడంతోపాటు ఆయా డ్రైనేజ్‌ల నుంచి వెలికితీసిన వ్యర్థాలు జీవీఎంసీ అధికారులను సైతం కంగుతినిపించాయి.

ఏఎస్ రాజా సర్కిల్‌లో..

ఏఎస్ రాజా సర్కిల్‌లో రాత్రి టిఫిన్స్, ఫుట్‌పాత్ వ్యాపారాలు కారణంగా వ్యర్థాలన్నీ ఇబ్బడిముబ్బడిగా డ్రైనేజ్‌కు చేరుతున్నాయి. వ్యర్థాలను నేరుగా ఫుట్‌పాత్ వ్యాపారులు డ్రైనేజ్‌లోకి వదిలేస్తుండటంతో టన్నుల కొద్దీ వ్యర్థాలు పేరుకుపోయి మొత్తం డ్రైనేజ్ బ్లాక్ అయిపోయింది. దీంతో వర్షపు నీటితోపాటు మురుగునీరు ప్రవహించే వీలు లేకపోవడంతో అధ్వాన్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ కారణంగా చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఆ కూడలి చెరువును తలపిస్తోంది. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు రూ.3 లక్షలతో అక్కడ డ్రైనేజ్ ఆధునికీకరణ పనులు చేపట్టి టన్నుల కొద్దీ వ్యర్థాలను వెలికితీశారు. చెత్తా చెదారంతోపాటు ప్లాస్టిక్ పేపర్లు, అల్పాహార వ్యర్థాలు పెత్త ఎత్తున నేరుగా డ్రైనేజ్‌లో వేయడంతో అక్కడ పరిస్థితి అధ్వాన్నంగా మారినట్లు ఇంజినీరింగ్ విభాగం అధికారులు నిర్ధారించారు. పనులు నిర్వహించి కొంత మేర పరిస్థితిని చక్కదిద్దినప్పటికీ ఫుట్‌పాత్ వ్యాపారాన్ని నియంత్రిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని ఆ విభాగ అధికారులు వెల్లడిస్తున్నారు.

చోద్యం చూస్తున్న ప్లానింగ్ విభాగం అధికారులు

అక్రమ షాపులు, ఫుట్‌పాత్ వ్యాపారులపై చర్యలు తీసుకోవడంలో జోన్ – 3 టౌన్ ప్లానింగ్ విభాగం అనుసరిస్తున్న తీరు నిత్యం విమర్శలపాలవుతోంది. అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) నుంచి సచివాలయ కార్యదర్శుల వరకు ఆ విభాగం ఉద్యోగులంతా కాసులు దండుకునేందుకే పరిమితం అవుతున్నారు. దీంతో ఆ విభాగం పరిష్కరించాల్సిన సమస్యలు ఎక్కడివక్కడే తిష్టవేయడంతో ఎంవీపీ కాలనీలో అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయి. ఫుట్‌పాత్ ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించకుండా ఆ విభాగం చోద్యం చూస్తోంది. గత కొన్ని నెలలుగా ఫుట్‌పాత్‌లను దాటి మరీ రోడ్లపైకి అనేక చోట్ల షాపులు పుట్టుకొస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో ఏసీపీ నుంచి కార్యదర్శుల వరకు అంతా ఫిర్యాదులపై కాకుండా వసూళ్లపైనే దృష్టి సారిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఇప్పటికైనా పెరిగిపోతున్న ఫుట్‌పాత్ వ్యాపారం నియంత్రించి... డ్రైనేజీల మరమ్మతులకు జీవీఎంసీ ఆదాయం వృథా కాకుండా ఆదా చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

లాసన్స్ బే కాలనీలో రూ.6 లక్షలతో..

లాసన్స్ బే కాలనీ బీచ్‌రోడ్డులో శాంతి ఆశ్రమం నుంచి కామత్ హోటల్ వరకు వున్న ఫుట్‌పాత్ వ్యాపారం కారణంగా డ్రైనేజీ ఇటీవల పూర్తిగా బ్లాక్ అయ్యింది. దీంతో స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఇంజినీరింగ్ విభాగం రూ.6 లక్షలతో మరమ్మతులు చేపట్టింది. ఆ మార్గంలో ఉన్న కమర్షియల్ షాపులు, ఫుట్‌పాత్‌పై ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు కారణంగా టన్నుల కొద్దీ వ్యర్థాలు డ్రైనేజ్‌లో చేరడంతో అది పూర్తిగా మూసుకుపోయింది. కొందరు వ్యాపారులు డ్రైనేజ్ పైనుంచి సైతం షాపులు కట్టేసి వ్యర్థాలు వేసేయడంతో అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం టన్నుల కొద్దీ వ్యర్థాలను వెలికి తీయాల్సి వచ్చింది.

చర్యలు తీసుకుంటాం

ఫుట్‌పాత్ వ్యాపారాలు కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నమాట వాస్తవమే. వాటిపై చర్యలు తీసుకోవడంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఎంవీపీ కాలనీలో చాలా చోట్ల ఈ సమస్య ఉంది. ఫిర్యాదులు సైతం అందుతున్నాయి. వాటన్నింటిపైనా చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తాం.

– మధుసూదన్ రావు, ఏసీపీ, జోన్ – 3

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



బొత్స సత్యనారాయణతో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ నాయకులు

బీచ్‌రోడ్డు : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కోరారు. సిరిపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ నాయకులు కలిశారు. నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పిలక మధుసూదన రెడ్డి, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వైదా నారాయణరావును ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా ప్రజలకు చేసిన మోసంపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ ఎప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని, పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముువ్వల సురేష్, అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు తదితరులు బొత్సను కలిశారు.

విద్యార్థినులకు 'చారిటీ బాక్సు' సాయం



విద్యార్థినికి రూ.50 వేల చెక్ అందిస్తున్న చారిటీ బాక్సు సభ్యులు

బీచ్‌రోడ్డు : ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారన్న కారణంతో భర్త నిరాదరణకు గురైన ఓ తల్లి (గాజువాకకు చెందిన రేణుక) తన పిల్లల ఉన్నత చదువుల కోసం 'చారిటీ బాక్సు'ను ఆశ్రయించడంతో వారు ఆర్థిక సాయం చేశారు. పెద్దమ్మాయి బీఎస్సీ నర్సింగ్, రెండో అమ్మాయి హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్నారు. వీరిద్దరి చదువుల నిమిత్తం చారిటీ బాక్సు ప్రతినిధులు పెదవాల్తేరులోని కార్యాలయంలో గురువారం మొదటి విడతగా రూ.50 వేల చెక్ అందజేశారు. ఈ సందర్భంగా చారిటీ బాక్సు కోశాధికారి పాట్నూరు వెంకట శివప్రసాద్ మాట్లాడుతూ ఎంత ఆధునికత వైపు పరుగులు పెడుతున్నా ఆలోచనల్లో ఇంకా మార్పు రావడం లేదన్నారు. ప్రస్తుత సమాజంలో ఆడ, మగ అనే తేడా లేదని చెప్పారు. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలు కూడా అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. అయినప్పటికీ ఆడ పిల్లలు పుట్టారని భార్యను, పిల్లలను వదిలేయడం ఆవేదన కలిగిస్తుందన్నారు. ఈ విషయంలో సమాజంలో మార్పు రావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. చారిటీ బాక్సు ప్రతినిధి పాట్నూరు వెంకట రమణ మాట్లాడుతూ తల్లిదండ్రుల నీడన ఆనందంగా బతకాల్సిన పిల్లలు ఇలా నిరాదరణకు గురికావడం బాధాకరమన్నారు. అందరూ లింగ సమానత్వానికి మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో లక్కోజు నూకరాజు పాల్గొన్నారు.

- పెదవాల్తేరులో ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహానికి చారిటీ బాక్సు ఆధ్వర్యంలో ఒక ఫ్యాన్ అందజేశారు. వసతి గృహంలో ఉన్న ఫ్యాన్ కొన్ని రోజులుగా పని చేయకపోవడంతో ఆ హోమ్ మేనేజర్ వినతి మేరకు గురువారం అందజేశారు.

యూపీహెచ్‌సీ మార్చాలని వినతి



జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డులో డ్రైనేజీని ఆనుకుని యూపీహెచ్‌సీ ఉండడంతో రోగులు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని... అక్కడి నుంచి వేరే ప్రాంతానికి మార్పు చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డుకు కేటాయించిన యూపీహెచ్‌సీ భవన నిర్మాణం కొన్ని కారణాల వల్ల జరగలేదని, దీంతో అధికారులు తాత్కాలికంగా పితానివీధిలో ఉన్న నూతన సామాజిక భవనంలో యూపీహెచ్‌సీ నిర్వహిస్తున్నారని వివరించారు. అయితే ఆ భవనాన్ని ఆనుకుని డ్రైనేజీ ఉందని... ఇది యూపీహెచ్‌సీ నిర్వహణకు అనుగుణంగా లేదని పేర్కొన్నారు. ఇక్కడి యూపీహెచ్‌సీని భానోజీనగర్‌లోని సచివాలయంలోకి తరలించి... ఆ సచివాలయాన్ని ఈ భవనంలోకి మార్పు చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు పల్లా దుర్గారావు తెలిపారు.


పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



కామర్స్ డిపార్ట్‌మెంట్ వద్ద స్వచ్ఛ ఆంధ్రలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఆచార్యులు

మద్దిలపాలెం : ఆంధ్ర యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, జాతీయ సేవా పథకం యూనిట్ 2 ఆధ్వర్యంలో గురువారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ ఆవరణలోని పిచ్చి మొక్కలు, తుప్పలు తొలగించారు. రెండు గార్డెన్లను శుభ్రం చేశారు. హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ జాలాది రవి మాట్లాడుతూ విద్యార్థులతో కలిసి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నామన్నారు. పర్యావరణాన్ని మనం కాపాడుకుంటే అది మనల్ని, మన సమాజాన్ని కాపాడుతుందన్నారు. ఫ్యాకల్టీ చైర్మన్ ప్రొఫెసర్ యం.ఉమాదేవి మాట్లాడుతూ పరిసరాలను మనం శుభ్ర పరుచుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ బొరుగడ్డ సుబ్బయ్య, వలంటీర్స్ పాల్గొన్నారు.

ముక్కల రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందులు



పాత డెయిరీఫారం పోస్టాఫీస్ ముందు అధ్వానంగా తయారైన సీసీ రోడ్డు

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు పరిధి పాత డెయిరీఫారం వద్ద ఓ రోడ్డుపై రాకపోకలు సాగించడం స్థానికులకు ఇబ్బందిగా మారింది. పాతడెయిరీఫారం నుంచి పోస్టాఫీస్ మీదుగా ఇందిరానగర్ వెళ్లే రోడ్డు ముక్కలుగా మారింది. ఈ సీసీ రోడ్డు గతంలో శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు చేపట్టిన భాగంలో పాత రోడ్డు కంటే కొంత ఎత్తులో ఉండటంతో పాదచారులకు ఇబ్బందిగా మారింది. గట్టును తలపిస్తున్న ఆ రోడ్డును అ పడిపోతున్నామని స్థానికులు అంటున్నారు. దీంతోపాటు ఈ రోడ్డు పక్కన సుమారు ఐదు అడుగుల లోతున కాలువ ఉంది. దీనికి రక్షణ గోడ లేకపోవడంతో వాహనచోదకులు కాలువలో పడి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు ఇక్కడి రోడ్డును పరిశీలించి మరమ్మతులు చేపట్టి, రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు.

సామాజిక భవన స్థలం విక్రయానికి సన్నాహాలు

- జీవీఎంసీ 10, 11 వార్డుల సరిహద్దులో 200 గజాల ఖాళీ స్థలం
- గతంలో ఆ స్థలాన్ని రూ.47 లక్షలకు అమ్మేసిన రవీంద్రనగర్ గ్రామ సంఘం సభ్యులు
- స్థానికుల ఫిర్యాదుతో స్థలం స్వాధీనం చేసుకున్న జీవీఎంసీ అధికారులు
- మళ్లీ అదే స్థలాన్ని రూ.40 లక్షలకు విక్రయించేందుకు యత్నాలు



రవీంద్రనగర్‌లో సామాజిక భవన స్థలం

ఆరిలోవ : జీవీఎంసీ పది, పదకొండో వార్డుల సరిహద్దులో ఉన్న సామాజిక భవనానికి చెందిన స్థలం విక్రయానికి కొందరు మళ్లీ పావులు కదుపుతున్నారు. ఈ స్థలం సుమారు 10 నెలల క్రితం విక్రయానికి గురైంది. దీన్ని రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు అడ్డుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ బోర్డును పక్కన పడేసి మళ్లీ ఆ స్థలాన్ని విక్రయించే ప్రయత్నంలో కొందరున్నారు. జీవీఎంసీ సామాజిక భవనానికి చెందిన 200 చదరపు గజాలకు పైగా ఖాళీ స్థలాన్ని రవీంద్రనగర్‌లో గ్రామ సంఘం కమిటీ సభ్యులు రూ.47 లక్షలకు వేరొకరికి అమ్మేశారు. ఇక్కడి బహిరంగ మార్కెట్ ధరలను బట్టి ఆ స్థలం సుమారు రూ.1.40 కోట్ల నుంచి రూ.1.60 కోట్ల విలువ చేస్తుందని స్థానికులు భావిస్తున్నారు. దీంతో గ్రామస్తులు పలువురు గత ఏడాది అక్టోబరులో సంఘం కమిటీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పలు పత్రికల్లో వార్తలు కూడా వచ్చాయి. దీనికి స్పందించిన అధికారులు జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలతో గత ఏడాది సెప్టెంబర్ 30న ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని... 'ఇది ప్రభుత్వ భూమి, దీన్ని ఎవరు ఆక్రమించినా శిక్షార్హులవుతారు' అంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో అప్పట్లో ఆ స్థలం విక్రయానికి బ్రేక్ పడింది. ఇప్పుడు మళ్లీ సంఘం సభ్యులే ఆ స్థలాన్ని విక్రయించడానికి పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీన్ని రూ.40 లక్షలకు ఓ వ్యక్తికి విక్రయానికి పెట్టినట్లు తెలిసింది. ఈ క్రమంలో గతంలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించి బయటకు కనిపించకుండా పక్కన పడేశారు. అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేయకుండా వదిలేయడంతో మళ్లీ ఈ స్థలం ఆక్రమణకు గురవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని అధికారులు రక్షించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తాం



ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి, నాణ్యమైన భోజనం అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడుతూ భోజనాల నాణ్యత పెంపొందించేందుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కమిటీలో విద్యార్థులు సైతం భాగస్వాములు కావాలని, పర్యవేక్షణలో వారి సహకారం అందించాలని సూచించారు. భోజన నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేందుకు విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. వంటశాలలు, భోజనశాలలను పూర్తిస్థాయిలో ఆధునికీకరించామని తెలిపారు. అదే విధంగా మరికొన్ని హాస్టల్స్‌లో మరమ్మతులు, ఇతర పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మిగిలిన వాటికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. విద్యార్థుల మెస్సులలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది వేతనాలను వర్సిటీ భరిస్తుందని చెప్పారు. ఏయూలోకి అనధికారిక వ్యక్తుల ప్రవేశాలను అడ్డుకునేందుకు రక్షణ గోడలను పటిష్టం చేసే దిశగా ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశామని, త్వరలో పనులు చేపడతామని వివరించారు. హాస్టల్స్‌కు అవసరమైన ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రధాన గ్రంథాలయాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు.

ఏయూ విద్యార్థి ఆరోగ్యంపై ఆరా

మద్దిలపాలెం : కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగ విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని గురువారం ఏయూ అధికారులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచనల మేరకు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకట్రావు కేజీహెచ్‌కు వెళ్లి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. విద్యార్థి ఆరోగ్య వివరాలను తల్లిదండ్రుల సమక్షంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ వివరించారు. అత్యుత్తమ చికిత్స అందిస్తున్నామని తెలియజేశారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులతో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని వేరే ఆస్పత్రికి తరలించాలని భావిస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. దీనిపై తల్లిదండ్రులు ఆలోచించుకుని నిర్ణయం తీసుకోవాలని, వేరొక ఆస్పత్రికి తరలించినా ఏయూ నుంచి అవసరమైన సహకారం అందిస్తామని రిజిస్ట్రార్ తెలిపారు.